క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు స్థానికతతో బదిలీలు చేయాలి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు నిర్వహించాలని కడప జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు హీరామియ్యా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక మండలం, స్థానిక మున్సిపాలిటీల్లోనే వారికి బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో పరిపాలనా సౌలభ్యం పేరుతో ఒక సచివాలయం నుంచి మరొక సచివాలయానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేయడం జరిగిందన్నారు. బదిలీల ప్రక్రియ లేకుండా ఐదు సంవత్సరాలుగా డిప్యుటేషన్ అంటూ కొందరు కమిషనర్లు మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కావున ప్రభుత్వం స్థానికత విషయంపై ఆలోచించి స్థానిక మండలం, స్థానిక మున్సిపాలిటీల్లోనే బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. లేనిపక్షంలో సచివాలయ ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు.

నేతాజీ సిద్ధాంతాలతో దేశం ముందడుగు



జెండా వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ సిద్ధాంతాలే ఈ దేశానికి ప్రత్యామ్నాయం అని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు అన్నారు. ఆదివారం కడప ఐటీఐ సర్కిల్ ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్ అధ్యక్షత అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 86 వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1939 జూన్ 22వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ కులమతాలకు అతీతమైన, అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం ఏఐఎఫ్‌బీని స్థాపించారన్నారు. భావ భౌతిక వాదాలకు అతీతమైన, ప్రకృతి వాద విధానంతో మనిషి జీవనం సాగాలని, దేశభక్తితో దేశాన్ని రక్షించి ప్రకృతి వనరులను ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. అదే విధంగా విద్య వైద్యం ప్రభుత్వ రంగంలోనే జరగాలని డిమాండ్ చేశారు. వ్యవసాయరంగం, పారిశ్రామికీకరణ సమతూకం ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. భారతదేశంలో సోషలిస్ట్ స్థాపన తప్పని సరిగా జరగవలసి ఉంటుందనేఉద్దేశంతో లక్నో నగరంలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించడం జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి ప్రజా సమస్యల పట్ల నిరంతరం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోరాడుతూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు అఖిల్ పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కడప రూరల్ : చంద్రబాబు ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌లో భాగంగా దూదేకుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్దయ్య, జాతీయ ఉపాధ్యక్షులు సుంకేసుల ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక మస్తాన్ కోచింగ్ సెంటర్‌లో దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పగిడాల సిద్దయ్య మాట్లాడుతూ దూదేకుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడతామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన దూదేకుల పిల్లలను దత్తత తీసుకోవాలన్నారు. ఇప్పటికే చాలా మంది పిల్లలు ఆర్థిక స్తోమత లేని కారణంగా ఉన్నతస్థానాలకు చేరలేక పోతున్నారని, అలాంటి వారికి ఆపన్నహస్తం అందించాలన్నారు. సుంకేసుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమి నేతలు బీసీ డిక్లరేషన్‌లో భాగంగా దూదేకుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంత వరకు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు దూదేకుల సంక్షేమానికి అన్నిచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఫయాజ్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా పీరయ్య, మస్తాన్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుబాన్, మహమ్మద్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలతో సంఘటితం

మైదుకూరు : గణేష్ ఉత్సవాలతో హిందువులు సంఘటితం అవుతారని తొట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీవిరజానంద స్వామి అన్నారు. మైదుకూరులో ఆదివారం గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విరజానందస్వామి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం బాలగంగాధర తిలక్, అంతకుముందు శివాజీ మహారాజ్ హిందువుల్లో సంఘటితం కోసం, సంస్కృతి సంప్రదాయాల కొనసాగింపు కోసం గణపతి సామూహిక నవరాత్రులను నిర్వహించారని పేర్కొన్నారు. గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ప్రతిమల ఊరేగింపును సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించాలని.. ఆ విషయంలో మైదుకూరు అందరికీ ఆదర్శం కావాలని తెలిపారు. సమావేశంలో గణపతి మహోత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

దుర్గంధం.. దోమలకు ఆవాసం

- కంపు కొడుతున్న మార్కెట్‌యార్డు పరిసరాలు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



మార్కెట్‌యార్డులో పండ్ల వ్యర్థాల నిల్వలు



చెత్తా చెదారంలో పాత సంచులు



బురదమయంగా పరిసరాలు

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్‌యార్డులో దుర్గంధం తాండవిస్తోంది. ఎక్కడ చూసినా పేరుకపోయిన చెత్తాచెదారం, కుళ్లినపండ్లు, వ్యర్థాలతో అధ్వానంగా మారింది. దీనికితోడు రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో అక్కడక్కడా నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో యార్కెట్‌యార్డుకు రైతులు వేరుశనక్కాయలు, పసుపును అమ్ముకునేందుకు వస్తుంటారు. ఈ దుర్గంధంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నిల్వ ఉన్న వాన నీటిపై ఉన్న దోమలు పట్టపగలే కుడుతున్నాయని వారు వాపోయారు. పట్టపగలు కుట్టే దోమలతో డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు ప్రబలితే ఏం చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. కావున మార్కెట్‌యార్డు అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, నిలిచిన వర్షపునీటిని తొలగించాలని కోరుతున్నారు. అపరిశుభ్రమైన ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం వంటి వాటిని చల్లి శుభ్రం చేయించాలని వారు వేడుకుంటున్నారు.

మానసిక వికాసంతోనే ఉత్తమ సమాజం



మాట్లాడుతున్న ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ కె.చిన్నపరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రతి మనిషి శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉత్తమ సమాజాన్ని నిర్మించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో కడప నగరం బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉచిత యోగ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడారు. యోగా మన వారసత్వ సంపద అన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అనాదిగా ఎంతో మంది కవులు, రచయితలు సైతం మన శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరిస్తూ రచనలు చేశారన్నారు. మనిషి పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం పొందేందుకు యోగ మంచి మార్గమన్నారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ అనంతబొట్ల వెంకట సుబ్బయ్య, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వీరసుదర్శనరెడ్డి, కడిమెళ్ల రాఘవేంద్రవర్మ, పద్మప్రియ చంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, భారవి, వెల్లాల వెంకటేశ్వరాచారి, కొండూరు జనార్ధన్‌రాజు, అవ్వారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయండి

చాపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయవా అని ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఏపీ రమణ ప్రశ్నించారు. మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం ఏపీ సేవా సమితి మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మండల శాఖా అధ్యక్షులుగా ఇడగొట్టు రామాంజనేయుడు, కార్యదర్శిగా మూలే నాగేశ్వర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏపీ రమణ మాట్లాడుతూ.. జిల్లాలో ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా స్వతంత్రంగా గత మూడేళ్లుగా రైతు సేవా సమితి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తోందన్నారు.

సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని నెంబర్ 3 హాస్టల్‌ను ఆర్ఎస్ఎఫ్ బృందం పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయడంతోపాటు ఖాళీగా ఉన్న కమాటి, వాచ్‌మెన్, వంట మాస్టర్, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకే వార్డెన్‌కు రెండు, మూడు హాస్టల్స్ ఇన్‌చార్జులుగా ఇచ్చి అవినీతి అక్రమాలకు పాల్పడడానికి జిల్లా అధికారులే లైసెన్సులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇన్‌చార్జుల పాలనలో ఒక్క హాస్టల్ నుంచే ఇతర హాస్టల్స్‌కు భోజనం సరఫరా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఫిల్టర్ వాటర్ ఇవ్వకపోవడం కారణంగా విద్యార్థులు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. బాత్రూంలు శుభ్రం చేయక పోగా కనీసం డోర్లు కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. తక్షణమే జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ వార్డెన్స్ ఆస్తులపై సిట్ విచారణ చేపట్టాలని, ఇన్‌చార్జి వార్డెన్‌కు కొమ్ము కాస్తున్న జిల్లా సంక్షేమ వసతి గృహాల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఫీజుల దోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి డొనేషన్ల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు సంబంధించి ఆర్జేడీ, డీఈవో, డిప్యూటీ ఈఓలు తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని ఉమ్మడి జిల్లా కలెక్టర్లు కల్పించుకుని చర్యలు డిమాండ్ చేశారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కడప నగరం, ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందుల, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించి అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యార్థి యువజన సంఘాలు విద్యాశాఖ అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసినప్పటికీ.. ఎటువంటి విచారణ గానీ, తనిఖీలు గానీ నిర్వహించలేదని మండిపడ్డారు. కనీసం విద్యాశాఖ అధికారులకు కూతవేట దూరంలో ఉన్న పాఠశాలలను కూడా తనిఖీ చేసే దానికి వారికి సమయం లేదా అన్నారు. కావున జిల్లా కలెక్టర్లు స్పందించి ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పీడీఎస్‌యూ నాయకులు మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

‘వక్ఫ్’ ఆస్తుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ‘వక్ఫ్’ ఆస్తుల ఆక్రమణలపై చర్చా వేదికకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘వక్ఫ్’ అంటే దైవార్పితమైన ఆస్తి అని తెలిపారు. రాజులు, నవాబులు, భక్తులు ముస్లిం సమాజం కోసం సమర్పించిన ఆస్తి అని పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్‌లోనూ, రాజ్యసభలోనూ ముస్లింలకు నష్టం చేసే ‘వక్ఫ్’ చట్టానికి అనుకూలంగా ఓటు వేసిందన్నారు. పైగా రాష్ట్రంలో ముస్లింలకు అన్యాయం జరగనివ్వబోము అంటూ చంద్రబాబు మాయమాటలు చెబుతున్నాడని, ఇది ఎలా ఉందంటే ‘గిచ్చి జోల పాట పాడినట్లుగా ఉంది’ అని విమర్శించారు. ఈ చట్టం ప్రస్తుతానికి సుప్రీంకోర్టులో ఉన్నా.. అంతిమ నిర్ణయం మాత్రం పార్లమెంటుదే నన్నారు. కడపలో పేద ముస్లింలకు ఉపయోగపడే రూ.వేల కోట్ల వక్ఫ్ ఆస్తులను కొంత మంది ముస్లింలు, ముస్లిమేతరులు ఆక్రమించి అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సాక్షాలతో ఆధారాలు చూపినా ‘దున్నపోతు మీద వర్షం’ పడినట్లుగా ఉందన్నారు. క్రిస్టియన్ల చర్చిల ఆస్తులు కూడా ఇప్పటికే సర్వే చేస్తున్నారని, వీటి పరిస్థితి కూడా ఇదే విధంగా కాకుండా క్రిస్టియన్లు మేల్కొనాలన్నారు. ఇక ఏమాత్రం ఉపేక్షించినా పేద ముస్లింలకు, క్రిస్టియన్లకు చెందాల్సిన ఆస్తులు కబ్జాదారుల పరమవుతాయని విమర్శించారు. వెంటనే ఆక్రమిత వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీన పరుచుకుని వక్ఫ్‌కు స్వాధీనం చేయాలని, ఉన్న వక్ఫ్ ఆస్తులు కబ్జాదారుల పరమవ్వకుండా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య, ముస్లిం సంఘం నాయకులు అబ్దుల్లా, హేతువాద సంఘ నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యమే ప్రొద్దుటూరుకు శాపం

ప్రొద్దుటూరు : పాలకుల నిర్లక్ష్యమే ప్రొద్దుటూరుకు శాపమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సీపీఐ 22వ పట్టణ మహాసభల సందర్భంగా పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకృష్ణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పసిడిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత బెంగళూరు, చెన్నై, కువైట్‌లకు వలస వెళుతున్నారని తెలిపారు. పాలకేంద్రం, కాటన్ మిల్లులు మూతపడ్డాయని, వాటిని తెరిపించాలని కానీ, నూతన పరిశ్రమల ఏర్పాటు చేసే ఆలోచన గానీ పాలకులు ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. సూపర్ 6 పథకాల్లో తల్లికి వందనం అమలులు కోతలేంటో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు చెల్లిస్తారని అన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల ముందుఓట్ల కోసం ఈ ప్రభుత్వం అరకొర పథకాలు విడుదల చేస్తారా అని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాస్పత్రి నుండి 21 మంది ఉద్యోగ, సిబ్బంది బదిలీ అయి వెళ్లిపోయారని, తిరిగి ప్రొద్దుటూరుకు వచ్చిన వారు 8 మంది మాత్రమేనన్నారు. ముందుగా పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభలో సీపీఐ పట్టణ నూతన కార్యదర్శిగా పి.సుబ్బరాయుడు, కౌన్సిల్ సభ్యులుగా జి.రామకృష్ణ, డి.శివారెడ్డి, చంద్రశేఖర్, దేవరశెట్టి నరసింహా, మచ్చ శ్రీను, హరి, ప్రమీల, సుజాత, దస్తగిరి, పీటర్, చైతన్య, మద్దిలేటి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, మధులను ఎన్నుకోవడం జరిగింది.

పేపర్ లెస్ రిజిస్ట్రేషన్ విధానం ఉపసంహరించుకోవాలి

- ఫిజికల్ డాక్యుమెంటు విధానాన్ని అమలు చేయాలి
- రాష్ట్ర జేఏసీ సభ్యులు గుంటి వేణుగోపాల్



మాట్లాడుతున్న రాష్ట్ర దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల జేఏసీ నాయకులు గుంటి వేణుగోపాల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రిజిస్ట్రేషన్ బిల్లు–2025లో పేపర్ లెస్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల జాయింట్ యాక్షన్ (జేఏసీ) నాయకులు గుంటి వేణుగోపాల్, సీఎం కేశవులు, ఫరూక్, రియాజ్, దామోదర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాత రిమ్స్ లోని బీసీ భవన్‌లో జరిగిన రాయలసీమ జిల్లాల దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో ప్రవేశపెడుతున్న రిజిస్ట్రేషన్ బిల్లు –2025 గురించి ఈ నెల 25వ తేదీ వరకు ప్రజాభిప్రాయం సేకరణ తీసుకుని, దేశవ్యాప్తంగా పేపర్ లెస్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకురావాలనే ప్రయత్నాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలలో కూటమి నేతలు రిజిస్ట్రేషన్ శాఖలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేపర్ లెస్ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకించారని, దీనివలన ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోతుందని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి తద్వారా ఓట్లు సంపాదించుకొని గద్దెనెక్కారని విమర్శించారు. తిరిగి పేపర్ లెస్ రిజిస్ట్రేషన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పేపర్ లెస్ రిజిస్ట్రేషన్లు అన్ని డిజిటల్ లాకర్‌లో ఉంటాయని, దీనివలన సైబర్ క్రైమ్ జరిగి ప్రజలు ఆస్తులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కోట్లాది రూపాయలు హెచ్చించి కొనుగోలు చేసిన ఆస్తులకు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి రిజిస్ట్రేషన్ చేసుకునేటువంటి కక్షిదారులకు ఆస్తుల దస్తావేజులు చేతికి ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ విధానం అమలు చేయడం వలన దేశవ్యాప్తంగా లక్షలాది మంది దస్తావేజులేఖర్లు, స్టాంప్ వెండర్లు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న రిజిస్ట్రేషన్ బిల్లు పైన పునరాలోచించి పేపర్ లెస్ విధానాన్ని ఉపసంహరించుకొని ఫిజికల్ డాక్యుమెంటు విధానాన్ని అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో దాదాపుగా రెండు సంవత్సరాల కాలంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులు సరఫరా చేయకపోవడంతో ప్రజలు, వెండర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్ బిల్లులో పేపర్ లెస్ విధానాన్ని ఉపసంహరించుకొని ఫిజికల్ డాక్యుమెంట్ విధానాన్ని అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో స్టాంప్ వెండర్లు, దస్తావేజు లేఖర్ల జేఏసీ నాయకులు ఓబులేసు, సంజీవరాయుడు, సురేష్‌కుమార్‌రెడ్డి, బసవరాజు, రామసుబ్బయ్య, వై.సుబ్బరాయుడు, కె.రామకష్ణారెడ్డి, కొండారెడ్డి, జమాల్డిన్, సిద్దు హుస్సేన్, రవిబాబుతోపాటు దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం యువతకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని దీనికి నిరసనగా సోమవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరెట్‌వద్దకు నిరుద్యోగ యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను భక్తులు చెల్లించుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఆర్పీల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల మహిళలకు పారదర్శకంగా, సులభతరంగా నిధులు ఉపయోగించడానికి ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించడంపై ఏపీ ఆర్పీల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేసీ.బాదుల్లా హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు పసుపు కుంకుమ పేరిట విడుదల చేసిన నిధులు మరియాపురం, లింగాల తదితర ప్రాంతాలలోని కొంత మంది జమ చేయకుండా పక్కదారి పట్టించి వాడుకున్న సంఘటనలు ఉన్నాయని వాటిపై విచారణ జరిపించాలన్నారు. జిల్లాలో కొంత మంది సెర్ప్‌లో పని చేస్తున్న అధికారులు సంవత్సరాల తరబడి ఒకే ప్రాంతంలో తిష్టవేసి విధులు నిర్వహిస్తూ డ్వాక్రా సంఘాల గ్రూపులపై ఆధిపత్యం చేస్తూ ఆర్పీలను బలిపశువులను చేస్తూ.. స్త్రీనిధి నిధులు, డ్వాక్రా గ్రూపు సంఘాల బ్యాంకు లోన్ల నిధుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై విచారణ జరిపించి కేసులు నమోదు చేసి శిక్షించాలన్నారు. సంవత్సరాల తరబడి పని చేస్తున్న ఆర్పీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలని, వేతనాలు వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని, ఆర్పీలందరికీ గుర్తింపు కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు.

రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న జిల్లా రజక సంఘం నేతలు

కడప రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రజకులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంతోపాటు పలు హామీలను అమలు చేస్తామని చెప్పారన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక హామీల అమలును ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు దోబీలుగా పిలువబడుతూ ఎస్సీ జాబితాలో చేర్చడం వల్ల ఆయా రాష్ట్రాల్లోని రజకులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందారని తెలిపారు. మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రజకులు అన్ని విధాలా వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. 50 ఏళ్లు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్ల మంజూరుతోపాటు లాండ్రీ షాపులకు సబ్సిడీ కరెంటు విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా దోబీఘాట్‌లకు నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అలాగే దోబీఘాట్ల స్థలాలు కబ్జాలకు గురికాకుండా ప్రత్యేక జీఓ విడుదల చేయాలన్నారు. రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజక వృత్తిదారులకు ఉచిత కరెంటు విధానాన్ని అమలు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు చెంద్రాయుడు, డాక్టర్ పిచ్చయ్య, సి.చెన్నప్ప, బండి ఎరికలయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.